నమస్తే తెలంగాణ
Telangana Today

# నిపుణ

నమస్తే తెలంగాణ
హైదరాబాద్, శనివారం 26 అక్టోబర్ 2024
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna


# నిర్బంధాలను ఎదిరించి.. ముక్త కంఠంతో ఖండించి..




- నిజాం-ఉల్-ముల్క్ అసఫ్‌జా బహదూర్ ఫతేజంగ్ 1724లో స్వతంత్ర హైదరాబాద్ రాజ్యాన్ని స్థాపించాడు. అప్పటి నుంచి 1948 వరకు జరిగిన అనేక రాజకీయ పరిణామాల్లో భాగంగా ఈ రాజ్యం ప్రత్యక్షంగా మొఘల్ చక్రవర్తుల సార్వభౌమత్వంలో, పరోక్షంగా బ్రిటిష్ ఆధిపత్యంలో నామమాత్రమై నిరంకుశ, భూస్వామ్య దోపిడీ విధాన పరిపాలన చట్రంలో బిగుసుకుపోయింది.
- 1857 తిరుగుబాటు తర్వాత మొదటి సాలార్‌జంగ్ సంస్కరణలు నిజాం హైదరాబాద్ రాజ్య పరిపాలనా వ్యవస్థను కొద్దిమేర క్రమబద్ధీకరించాయి. కానీ ప్రజల సంక్షేమం కోరే రాజ్యంగా గుర్తించలేదు.
- దీనికితోడు దేశంలో పెల్లుబికిన జాతీయతా భావ ప్రభావం, 1885లో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ స్థాపన, జాతీయోద్యమ వ్యాప్తి హైదరాబాద్ రాష్ట్రంలో స్పష్టమైన ప్రభావాన్ని చూపించాయి.
- 1883 నాటి చాందా రైల్వే స్కీం ఆందోళన, దానికి వివిధ పత్రికలు కల్పించిన ప్రచారం, హైదరాబాద్ రాజ్యంలో స్వాతంత్ర్య సమరశీల భావాలను, రాజకీయ చైతన్యాన్ని కల్పించడంతో క్రమంగా వివిధ రకాలైన సంస్థలు, సంఘాలు ఏర్పాటయ్యాయి. వాటిలో ముఖ్యమైనవి..
- 1901 నాటికి విజ్ఞానచంద్రికా గ్రంథ మండలి- గ్రంథాలయోద్యమం,
- 1921లో ఆంధ్రజన సంఘం,
- 1924లో ఆంధ్రజన కేంద్ర సంఘం,
- ఆంధ్రజన సంఘం, ఆంధ్రజన కేంద్ర సంఘం కలిసి 1930లో ఆంధ్రమహాసభగా ఏర్పడ్డాయి.
- 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్,
- 1939లో కామ్రేడ్స్ అసోసియేషన్,
- 1940లో హైదరాబాద్ కమ్యూనిస్టు పార్టీ,
- 1942లో ఆల్ హైదరాబాద్ స్టూడెంట్స్ యూనియన్ లాంటి అనేక రాజకీయ, రాజకీయేతర, స్వచ్ఛంద, సాంస్కృతిక సంస్థలు కలిసి హైదరాబాద్ రాజ్యంలో అమల్లో ఉన్న నిరంకుశ సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక నిర్బంధ విధానాలన్నింటినీ ముక్త కంఠంతో ఎదిరించారు.
- చివరకు 1947, ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చింది. కానీ హైదరాబాద్ రాజ్యానికి రాలేదు.
- దీంతో చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ తన రాజ్యం భారత్‌లో కలపలేదు. స్వతంత్రంగానే ఉంటుందని ప్రకటించాడు.
- తప్పనిసరి పరిస్థితుల్లో హైదరాబాద్ రాజ్యంపై ఇండియన్ యూనియన్ ప్రభుత్వం 1948, సెప్టెంబర్ 13 నుంచి 18 వరకు పోలీసు చర్య జరిపి హైదరాబాద్ రాజ్యాన్ని భారత్‌లో విలీనం చేసుకోవాల్సి వచ్చింది.

**యథాతథ స్థితి ఒప్పందం - ఉల్లంఘన**

- దేశానికి స్వాతంత్ర్యం రాకముందు బ్రిటిష్ వారి విభజించు-పాలించు విధానంలో భాగంగా నాటి గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్‌బాటన్ ప్రకారం స్వదేశీ సంస్థానాలు హిందుస్థాన్‌లో లేదా పాకిస్థాన్‌లోనైనా విలీనం కావచ్చని లేదా స్వతంత్రంగానైనా ఉండొచ్చని ప్రకటించాడు.
- దీని వల్ల మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1947, ఆగస్టు 13న స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాడు. సర్దార్ వల్లభాయ్ పటేల్, నెహ్రూలు దీన్ని తీవ్రంగా పరిగణించారు. హైదరాబాద్ రాజ్య సరిహద్దుల్లో సైన్యాన్ని మోహరించారు.
- గమనించిన నిజాం ప్రభుత్వం 1947, నవంబర్ 29న భారత ప్రభుత్వంతో యథాతథ స్థితి ఒప్పందం చేసుకుని హైదరాబాద్ రాజ్య విదేశీ వ్యవహారాలను 1948, నవంబర్ 29 వరకు భారత ప్రభుత్వానికి అప్పగించాడు.
- నిజాం ఒకవైపు భారత ప్రభుత్వంతో ఒప్పందం చేసుకోవడంతో పాటు ఇంగ్లండ్, అమెరికా ఇతర రాజ్యాల సహకారానికి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం మొదలు పెట్టాడు.
- ఆయుధాలను సమకూర్చుకోడానికి హైదరాబాద్ మిలిటరీ జనరల్ అహ్మద్ సయ్యద్, ఎల్.ఎడ్రూస్‌ను ఇంగ్లండ్‌కు పంపి, సిడ్నీకాటన్, హెన్రీ లష్‌విజ్‌ల ద్వారా ఆయుధాల సరఫరాకు ఒప్పందం కుదుర్చుకొన్నాడు.
- మందుగుండు సామగ్రికి బ్రిటిష్ మాజీ సైనికాధికారి టి.టి.మూర్‌తో మరో ఒప్పందం కుదుర్చుకున్నాడు.
- నిజాం తన రాజ్యంలో సాధారణ క్రయ విక్రయాల్లో సైతం భారత రూపాయి వినియోగంపై పరిమితులు విధించాడు.
- ఒప్పందంలోని విదేశీ వ్యవహారాల నియమానికి విరుద్ధంగా హైదరాబాద్ నిజాం భారత సెక్యూరిటీల నుంచి 20 కోట్ల రూపాయలను పాకిస్థాన్‌కు రుణంగా ఇచ్చాడు.
- హైదరాబాద్ రాజ్య ప్రధానమంత్రి మీర్ లాయక్ అలీ 1948, ఆగస్టు 24న ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సెక్రటరీ జనరల్‌కు భారత ప్రభుత్వంపై సర్‌వాల్టర్ మాంక్టన్ సాయంతో అధికారికంగా ఫిర్యాదు చేశాడు.

**నిజాం రాజ్యంపై భారత ప్రభుత్వ ఆంక్షలు**

- భారత ప్రభుత్వం నిజాం రాజ్యంపై సాధింపు చర్యలను ప్రారంభించింది. ఆర్థిక దిగ్బంధాలకు తోడు హైదరాబాద్‌కు చెందిన 'దక్కన్ ఎయిర్‌వేస్'ను భారత భూభాగంపై ఎగరడాన్ని నిషేధించింది.
- దీంతో హైదరాబాద్‌కు బయటి ప్రపంచంతో ప్రయాణ సౌకర్యాలు, సమాచార, ప్రచార, ప్రసార సంబంధాలు తెగిపోయాయి.
- మద్రాస్, ఢిల్లీ మధ్య నడిచే గ్రాండ్ ట్రంక్ ఎక్స్‌ప్రెస్ రైలును హైదరాబాద్ రాజ్యం ద్వారా కాకుండా ఆ రాజ్య సరిహద్దుల బయటి నుంచి వెళ్లేటట్లు దారి మళ్లించడం, టెలిఫోన్ సంభాషణలు వినబడకుండా, బంగారం, వజ్రాభరణాల, నాణేల ఎగుమతులపై నిషేధం విధించడం, ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు హైదరాబాద్ స్టేట్ బ్యాంక్‌ల మధ్య సంబంధాలను తక్షణమే రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.
- బ్రిటిష్ వైస్రాయ్, భారత ప్రభుత్వ చట్టం ప్రకారం భారత్‌లోని వివిధ సంస్థానాలు, రాజ్యాలు తమ సొంత నిర్ణయం తీసుకోవడంలో పూర్తి స్వేచ్ఛను కలిగి ఉండటం వల్ల హైదరాబాద్ నిజాం రాజ్యానికి కూడా సాంకేతికంగా ఈ స్వేచ్ఛ ఉంటుంది.
- పై అంశాలను పరిశీలిస్తే భారత ప్రభుత్వమే 'యథాతథ స్థితి ఒప్పందాన్ని' ఉల్లంఘించింది.
- హైదరాబాద్ రాజ్యంపై పోలీసు చర్య జరపడానికి సిద్ధమవుతూనే దేశంలో అంతర్గత అశాంతి చెలరేగకుండా ముందస్తుగానే 'అత్యవసర పరిస్థితిని' భారత ప్రభుత్వం ప్రకటించింది.

**హైదరాబాద్ రాజ్యంపై పోలీసు చర్య**

- 1948, జూన్ 21న మౌంట్ బాటన్ గవర్నర్ జనరల్‌గా పదవీ విరమణ చేసి ఇంగ్లండ్‌కు వెళ్లాడు. అనంతరం రాజగోపాలాచారి గవర్నర్ జనరల్ అయ్యాడు.
- దీంతో ఆంగ్లేయుల నామమాత్రపు ఆటంకం తొలగిపోయినా నెహ్రూ తాత్సారం చేశాడు. దానికి కారణం అహింసామార్గంలో దేశ స్వాతంత్ర్యం పొందినవారు హైదరాబాద్ రాజ్యంపై హింసామార్గం అవలంబిస్తున్నారని అంతర్జాతీయంగా చెడ్డపేరు వస్తుందనే అనుమానం.
- దీంతో పాటు హిందూ-ముస్లింల మధ్య మత కలహాలు చెలరేగుతాయన్న భయం నెహ్రూను ఆలోచనలో పడేసింది.
- కానీ హోంమంత్రి వల్లభాయ్ పటేల్ తాము అధికారంలో ఉన్న దేశంలో ప్రజలపై హింసాకాండ తగదన్నాడు.
- నెహ్రూ అధ్యక్షతన జరుగుతున్న 'రక్షణ కమిటీ' నుంచి వాకౌట్ చేయడంతో తప్పనిసరి పరిస్థితిలో రాజగోపాలాచారి కలుగజేసుకొని హైదరాబాద్‌పై పోలీసు చర్య తీసుకోవడానికి నెహ్రూని ఒప్పించి దానికి పోలీస్ యాక్షన్ అనే పేరు సూచించాడు.
- 1948, జూన్ చివరి వారం వరకు హైదరాబాద్ రాజ్య విలీనంపై భారత ప్రభుత్వానికి, నిజాంకు మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి.
- కశ్మీర్ సమస్య రగులుతుండటం, రుతుపవన వర్షపాతం అధికంగా ఉండటం వల్ల హైదరాబాద్ రాజ్యంపై సైనిక చర్యను కొంత కాలం వాయిదా వేసింది.
- ఇదే సమయంలో హైదరాబాద్ రాజ్యానికి పెద్ద మద్దతుదారుడైన పాకిస్థాన్ మొదటి గవర్నర్ జనరల్ మహ్మద్ అలీ జిన్నా సెప్టెంబర్ 12న మరణించాడు. దీంతో హైదరాబాద్ రాజ్యంలో సెలవు ప్రకటించి మక్కామసీదులో సామూహిక సంతాప ప్రార్థనలు ఏర్పాటు చేశారు.
- దీంతో 20 కోట్ల రూపాయల రుణం తీసుకున్న పాకిస్థాన్ నుంచి నిజాంకు ఏ సాయం అందదనే విషయం తేలిపోయింది.
- ఇదే అదునుగా భావించిన భారత ప్రభుత్వం ఐక్యరాజ్య సమితిలో 'హైదరాబాద్ అంశం' చర్చకు రానుందని గ్రహించి యుద్ధ ప్రాతిపదికన 1948, సెప్టెంబర్ 13న హైదరాబాద్ రాజ్యంపై సైనిక చర్యలో భాగంగా సైన్యాలను రాజ్య సరిహద్దుల్లో మోహరించింది.
- సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆనాటి భారత సైనిక శాఖామాత్యులైన బల్‌దేవ్‌సింగ్ ప్రమేయం లేకుండానే పోలీసు చర్యకు ఆజ్ఞాపించాడు. దాన్ని మిలిటరీ భాషలో 'ఆపరేషన్ పోలో' అని వ్యవహరిస్తారు.

**తెలుగు అకాడమీ సౌజన్యంతో**

### ఆపరేషన్ పోలో

- హైదరాబాద్ రాజ్యంలో కమ్యూనిస్టులు, రజాకార్లు కొనసాగిస్తున్న హింసా-ప్రతిహింసలకు వ్యతిరేకంగా శాంతి స్థాపన కోసం భారత ప్రభుత్వం 'ఆపరేషన్ పోలో' నిర్వహించబోతుందని పాకిస్థాన్ హైకమిషనర్‌కు, అమెరికా ప్రభుత్వానికి తెలియజేసింది.
- సైన్యానికయ్యే ఖర్చులు హోం శాఖలో కాకుండా, అటు రక్షణ శాఖలో కాకుండా విద్యా శాఖ ఖజానాలో జమ చేశారు.
- ఈ పోలీసు చర్య సంపూర్ణంగా సదరన్ కమాండ్‌కు జీవోసీ అయిన లెఫ్టినెంట్ జనరల్ మహరాజ్ సింగ్ నేతృత్వంలో జరిగింది.
- షోలాపూర్ నుంచి మేజర్ జనరల్ జేఎన్ చౌదరి, విజయవాడ నుంచి మేజర్ జనరల్ రుద్ర చేసిన దాడులు ప్రధానమైనవి.
- 1948, సెప్టెంబర్ 13న భారత సేనలు చౌదరి నాయకత్వంలో షోలాపూర్, నల్దుర్గ, తామల్‌వాడి, తుల్జాపూర్‌లను ఆక్రమించాయి.
- మరోపక్క 'లహ్మా' ప్రాంతం నుంచి కొన్ని బలగాలు ఉస్మానాబాద్‌కు దూసుకొచ్చాయి. అదే క్రమంలో తుల్జాపూర్ లొంగిపోయింది.
- నిజాం సైనికులు తమ పోస్టులను వదిలి పారిపోయారు.
- మేజర్ రుద్ర నాయకత్వంలో మునగాల నుంచి పురోగమించిన సేనలు బోనకల్లును స్వాధీనపర్చుకొన్నాయి. ఆరోజే అహ్మద్‌నగర్, మధ్య భారత్, మైసూర్ ప్రాంతాల నుంచి హైదరాబాద్ రాజ్య సరిహద్దులు దాటి భారత సబ్సిడరీ సేనలు చొచ్చుకొని వచ్చాయి.
- 1948, సెప్టెంబర్ 14న దౌలతాబాద్, జాల్నా, పర్భనీ జిల్లాలోని మానిక్‌ఖేడ్, కన్నెగాంవ్‌లు కూడా లొంగిపోయాయి.
- వరంగల్ జిల్లాలో మకాం వేసిన నిజాం సేనలు కూడా మేజర్ జనరల్ రుద్ర సేనలకు లొంగిపోక తప్పలేదు.
- ఒక్క సూర్యాపేటలో మాత్రం కొంతసేపు నిజాం సేన నిలువరించగలిగింది. కానీ నిరాయుధులైన జనం మీద కాల్పులు జరిపిన నిజాం సైన్యాలు శక్తిమంతమైన భారత సైనికుల ముందు ఎంతసేపు నిలవలేకపోయాయి.
- సూర్యాపేట గ్రామంలోకి ప్రవేశిస్తున్న భారత సేనలకు ప్రజలు స్వాగతం పలికారు.
- 1948, సెప్టెంబర్ 16న జహీరాబాద్, హింగోలి, రాయచూర్, పర్భని, కొప్పల్, మునీరాబాద్ తదితర పట్టణాలన్నీ భారత సేనల వశమయ్యాయి.
- చివరికి నిజాంకు భారత ఏజెంట్ జనరల్ కె.ఎం. మున్షీని శరణువేడటం ఒక్కటే మిగిలింది. ఇంతలో మేజర్ జనరల్ చౌదరి నాయకత్వంలో భారత సేనలు పటాన్‌చెరువు రానే వచ్చాయి.
- భారత సైన్యానికి సమాచారం అందిస్తున్న నిజాం రాజ్య మిలిటరీ కమాండర్ సయ్యద్ అహ్మద్ ఇఎల్.ఎడ్రూస్ భారత సైన్యానికి వ్యతిరేకంగా యుద్ధం చేయకుండా హైదరాబాద్‌కు తిరిగి రావాలని కిందిస్థాయి సైనికాధికారులకు రహస్యంగా ఆదేశాలు పంపాడు.
- దీంతో రోజుల వ్యవధిలోనే హైదరాబాద్ నగరంలోకి మేజర్ జనరల్ జె.ఎన్ చౌదరి నేతృత్వంలోని సేనలు ప్రవేశించాయి.
- ఒకవేళ ఎడ్రూస్ అలాంటి పని చేయకపోతే భారత సైన్యం సెప్టెంబర్ 17 లోగా హైదరాబాద్ నగరంలోకి రాలేకపోయేది.
- సెప్టెంబర్ 17న సాయంకాలం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో హైదరాబాద్ అంశం చర్చకు వచ్చి హైదరాబాద్ రాజ్యం స్వతంత్ర రాజ్యంగా లేదా జమ్మూకశ్మీర్‌లా స్వతంత్ర ప్రతిపత్తి కలిగి ఉండేది.

## విద్య, ఉద్యోగ సమాచారం

### నేషనల్ సీడ్స్‌లో....

**నేషనల్ సీడ్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 188
- **పోస్టులు:** డీజీఎం, అసిస్టెంట్ మేనేజర్, మేనేజ్‌మెంట్ ట్రెయినీ, సీనియర్ ట్రెయినీ, ట్రెయినీ
- **విభాగాలు:** విజిలెన్స్, హెచ్‌ఆర్, అగ్రికల్చర్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, క్వాలిటీ కంట్రోల్, స్టెనోగ్రాఫర్, అకౌంట్స్, టెక్నీషియన్ తదితరాలు
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 30
- **వెబ్‌సైట్:** www.indiaseeds.com

### తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో...

**తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీఎంసీ)లో డైరెక్ట్/కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 3
- **పోస్టులు:** జూనియర్ అసిస్టెంట్, విజిలెన్స్ ఆఫీసర్
- **అర్హతలు**, ఎంపిక తదితరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చివరితేదీ:** నవంబర్ 11
- **వెబ్‌సైట్:** https://onlinetsmc.in

### టీఐఎఫ్‌ఆర్‌లో...

**టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (టీఐఎఫ్‌ఆర్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 15
- **పోస్టులు:** క్లర్క్ ట్రెయినీ (అకౌంట్స్), క్లర్క్ ట్రెయినీ (అడ్మినిస్ట్రేషన్)
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **ఇంటర్వ్యూ తేదీ:** నవంబర్ 18
- **వెబ్‌సైట్:** http://www.tifr.res.in

### ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్


**పోటీ పరీక్షల ప్రత్యేకం**

- గ్రూప్స్: కరెంట్ అఫైర్స్, చరిత్ర బిట్స్ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

# హైదరాబాద్‌లోని మొజంజాహి మార్కెట్‌కు ఎవరి పేరు పెట్టారు?

**ఆధునిక తెలంగాణ చరిత్ర**

**పోటీ పరీక్షల ప్రత్యేకం**
**చరిత్ర బిట్స్**



**1. నిజాం అలీఖాన్ కాలంలో నిర్మించిన కట్టడాలను గుర్తించండి.**
ఎ. అసెంబ్లీ భవనం
బి. మోతీ మహల్
సి. రోషన్ బంగ్లా
డి. గుల్షన్ మహల్

**2. కింది వాక్యాల్లో సరైనది గుర్తించండి.**
ఎ. సైన్య సహకార విధానాన్ని లార్డ్ వెల్లస్లీ ప్రవేశపెట్టాడు
బి. నిజాం అలీఖాన్ సైన్య సహకార విధానాన్ని 1798లో అంగీకరించాడు
1) ఎ 2) బి
3) ఎ, బి 4) పైరెండూ కావు

**3. హైదరాబాద్‌లోని బ్రిటిష్ రెసిడెంట్లను వారి పాలనా కాలాన్ని అనుసరించి సరైన కాలక్రమాన్ని గుర్తించండి.**
1) సెడెన్ హోమ్, కిర్క్ ప్యాట్రిక్, హెన్రీ రస్సెల్స్, చార్లెస్ మెట్‌కాఫ్
2) సెడెన్ హోమ్, చార్లెస్ మెట్‌కాఫ్, హెన్రీ రస్సెల్స్, కిర్క్ ప్యాట్రిక్
3) కిర్క్ ప్యాట్రిక్, హెన్రీ రస్సెల్స్, సెడెన్ హోమ్, చార్లెస్ మెట్‌కాఫ్
4) కిర్క్ ప్యాట్రిక్, సెడెన్ హోమ్, హెన్రీ రస్సెల్స్, చార్లెస్ మెట్‌కాఫ్

**4. వహాబీ ఉద్యమకారులు కానివారిని గుర్తించండి.**
ఎ. షోయబుల్లా ఖాన్
బి. గులాం రసూల్ ఖాన్
సి. ముబారెజ్ ఉద్దౌల
డి. మౌల్వీ సలీం
1) ఎ 2) బి
3) సి, డి 4) డి

**5. మొదటి సాలార్‌జంగ్ కాలంలోని మంత్రులు వారి శాఖలకు సంబంధించి సరికాని జతను గుర్తించండి.**
1) నవాజ్ జంగ్ - పబ్లిక్ వర్క్స్ శాఖ
2) ముఖరం ఉద్దౌలా - రెవెన్యూ శాఖ
3) బషీరుద్దౌల - న్యాయశాఖ
4) షంషేర్ జంగ్ - సైనిక శాఖ

**6. నిజాం నసీరుద్దౌల బ్రిటిష్ వారి నుంచి తీసుకున్న రుణాలను చెల్లించలేనందుకు ఏ ప్రాంతాలను బ్రిటిష్ వారికి దారాదత్తం చేశాడు?**
ఎ. ఔరంగాబాద్ బి. బీరార్
సి. ఉస్మానాబాద్ డి. రాయచూర్
1) ఎ, బి, సి 2) బి, సి, డి
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి

**7. ఏడో నిజాం కాలంలో స్థాపించిన ఆధునిక పరిశ్రమలు, వాటి స్థాపన సంవత్సరాలను జతపరచండి.**
ఎ. నిజాం షుగర్ లిమిటెడ్ - బోధన్ 1. 1934
బి. పేపర్ మిల్లు - సిర్పూర్ కాగజ్ నగర్ 2. 1942
సి. అజంజాహి మిల్లు - వరంగల్ 3. 1937
డి. ఆల్విన్ మెటల్స్ - హైదరాబాద్ 4. 1939
1) ఎ-3, బి-4, సి-1, డి-2 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-2, బి-3, సి-4, డి-1 4) ఎ-1, బి-2, సి-3, డి-4

**8. ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌పై 1947, డిసెంబర్ 4న కింగ్ కోఠిలో జరిగిన హత్యాయత్నంతో సంబంధం ఉన్న వ్యక్తులను గుర్తించండి.**
ఎ. నారాయణ పవార్
బి. రావి నారాయణ రెడ్డి
సి. జగదీశ్వర ఆర్య
డి. గంగారం
ఇ. కొండా లక్ష్మణ్ బాపూజీ
1) ఎ, బి, సి, ఇ 2) ఎ, సి, డి, ఇ
3) ఎ, సి, డి 4) ఎ, బి, సి, డి, ఇ

**9. కుర్ర కత్తి వీరుడు అనే బిరుదు కలిగిన వారు?**
1) నిజాం ఉల్ ముల్క్
2) నిజాం అలీ ఖాన్
3) మహబూబ్ అలీ ఖాన్
4) ముజఫర్ జంగ్

**10. ఆంగ్లేయులను వివిధ తిరుగుబాట్ల నుంచి కాపాడినందుకు నిజాంకు కలిగిన ఫలితాలు?**
ఎ. ఆంగ్లేయులు 1853లో తీసుకున్న రాయచూర్, ఉస్మానాబాద్ తిరిగి ఇచ్చారు
బి. నిజాం బాకీ పడిన రూ.50 లక్షల అప్పును రద్దు చేశారు
సి. స్టార్ ఆఫ్ ఇండియా, విశ్వసనీయ మిత్రుడు అనే బిరుదులు నిజాంకు ఇచ్చారు
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, బి, సి 4) ఎ, సి

**11. కింది వాక్యాల్లో సరైనది గుర్తించండి.**
ఎ. 1884లో హైదరాబాద్ కాలేజ్ ఏర్పడింది
బి. 1887లో హైదరాబాద్ కాలేజ్ నిజాం కాలేజీగా పేరు మార్చుకుంది
1) ఎ 2) బి
3) ఎ, బి 4) పైరెండూ కావు

**12. నాజర్ జంగ్, ముజఫర్ జంగ్‌ను హత్య చేసిన పఠాన్ నవాబ్‌లను గుర్తించండి.**
1) సవనూర్ నవాబు అబ్దుల్ కరీం ఖాన్
2) కర్నూల్ నవాబు హిమ్మత్ బహదూర్ ఖాన్
3) కడప నవాబు అబ్దుల్ నబీ ఖాన్
4) పైవారందరూ

**13. కింది వాక్యాల్లో సరైనది గుర్తించండి.**
ఎ. దోమకొండ సంస్థానాన్ని బిక్కవోలు సంస్థానం అని కూడా అంటారు
బి. జటప్రోలు సంస్థానాన్ని కొల్లాపూర్ సంస్థానం అని కూడా అంటారు
1) ఎ 2) బి
3) ఎ, బి 4) పైరెండూ కావు

**14. హైదరాబాద్‌లోని మొజంజాహి మార్కెట్‌కు ఎవరి పేరు పెట్టారు?**
1) ఉస్మాన్ అలీ ఖాన్ మొదటి కుమారుడు
2) ఉస్మాన్ అలీ ఖాన్ రెండో కుమారుడు
3) మహబూబ్ అలీ ఖాన్ మనవడు
4) ఉస్మాన్ అలీ ఖాన్ సోదరుడు

**15. కింది వాటిని వ్యవస్థాపక ఆధారంగా క్రమపద్ధతిలో తెలపండి**
ఎ. ఉస్మానియా జనరల్ హాస్పిటల్
బి. సిటీ కాలేజ్
సి. ఉస్మానియా యూనివర్సిటీ
డి. నిజాం కాలేజ్
1) బి, డి, సి, ఎ 2) డి, సి, బి, ఎ
3) బి, సి, డి, ఎ 4) డి, బి, సి, ఎ

**16. కింది వాక్యాల్లో సరికానిది గుర్తించండి.**
1) 1857 సిపాయిల తిరుగుబాటు సమయంలో హైదరాబాద్ రెసిడెంట్‌గా కల్నల్ డేవిడ్ సన్ ఉన్నాడు
2) నిజాం అలీ ఖాన్ ఇంగ్లండ్ ఈస్ట్ ఇండియా కంపెనీతో సైనిక సహకార ఒప్పందం చేసుకున్నాడు
3) 1839 హైదరాబాద్‌లో వహాబీ కుట్ర జరిగింది
4) 1854లో నిజాం ఈస్ట్ ఇండియా కంపెనీ బీరార్ ఒప్పందంపై సంతకాలు చేశారు

**17. కింది ఎవరి మరణానంతరం హిమాయత్ సాగర్ ప్రాజెక్ట్ పేరును మార్చారు?**
1) ఉస్మాన్ అలీ ఖాన్ పెద్ద కుమారుడి అనంతరం
2) ఉస్మాన్ అలీ ఖాన్ మేనల్లుడి అనంతరం
3) ఉస్మాన్ అలీ ఖాన్ రెండో కుమారుడి అనంతరం
4) మహబూబ్ అలీ ఖాన్ చిన్న కుమారుడి అనంతరం

**18. మహిళలు వారికి సంబంధించి సంస్థలను జతపరచండి.**
ఎ. థేహ్మా నబాయి ధాగే 1. మహిళా సమాజం
బి. మార్గరెట్ ఇక జిమ్స్ 2. యువతి శరణాలయం
సి. రావి చెట్టు లక్ష్మీనర్సమ్మ 3. చిల్డ్రన్ సొసైటీ
డి. యామిని పూర్ణ తిలకం 4. అసోసియేషన్ ఫర్ ఎడ్యుకేషన్ అండ్ సోషల్ అడ్వాన్స్‌మెంట్
1) ఎ-3, బి-4, సి-1, డి-2 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-2, బి-3, సి-4, డి-1 4) ఎ-4, బి-3, సి-2, డి-1

**19. కింది వాక్యాల్లో సరైనవి గుర్తించండి.**
ఎ. సుగ్ర హుమాయూన్ మీర్జా సంపాదకత్వం వహించిన పత్రిక పేరు జెబ్-ఉన్-నిస్సా
బి. మహమ్మదీ బేగం నడిపిన పత్రిక పేరు తహజ బున్నీసా
1) ఎ 2) బి
3) ఎ, బి 4) పైరెండూ కావు

**20. కింది వాటిలో వక్ఫ్ భూములు అంటే?**
1) గ్రామ అధికారులకు ఇచ్చిన భూములు
2) ముస్లిం మత సంస్థల నిర్వహణకు ఇచ్చిన భూములు
3) ముస్లిం పురోహితులకు ఇచ్చిన భూములు
4) ముస్లిం అధికారులకు ఇచ్చిన భూములు

**21. కింది వాక్యాల్లో సరైనవి గుర్తించండి.**
ఎ. సరోజిని నాయుడు కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించిన తొలి భారతీయ మహిళ
బి. అనీ బిసెంట్ కాంగ్రెస్ తొలి మహిళ అధ్యక్షురాలు
1) ఎ 2) బి
3) ఎ, బి 4) పైరెండూ కావు

**22. ఇజారా, పాన్ మక్తా, సర్ఫే ఖాస్ అనే పదాలు వేటికి సంబంధించినవి?**
1) నిజాం పాలన కాలంలో అధికారుల హోదాలు
2) నిజాం పాలన కాలంలో రెవెన్యూ కేంద్రాల పేర్లు
3) నిజాం పాలన కాలంలో సాగునీటి ప్రాజెక్టుల పేర్లు
4) నిజాం పాలన కాలం నాటి వివిధ రకాల భూ యాజమాన్యం

**23. హైదరాబాద్ సంస్కృతిని గంగా జమున తెహజీబ్‌గా ఎందుకు వర్ణించారు?**
1) ఇది హిందూ ముస్లింల సహృద్భావ సంబంధాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది
2) ఇది ఆర్య, ద్రవిడ సంస్కృతుల మిశ్రమం
3) ఇది కుతుబ్ షాహీ, అసఫ్‌జాహీల సంప్రదాయాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది
4) ఇది ఇస్లాం మత ప్రత్యేకతను తెలియజేస్తుంది

**24. తెలంగాణలో నెలకొన్న సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులకు సంబంధించి సరైనవి గుర్తించండి.**
ఎ. ఉర్దూ రాజభాషగా ఉన్నా కూడా తెలుగుకు సమ ప్రాధాన్యం లభించింది
బి. నిజాం మద్దతుతో అనేక ముస్లిం సంస్థలు మతమార్పిడికి పాల్పడ్డాయి
సి. దొరలు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్‌దారులు భూస్వామ్య దోపిడీకి శ్రీకారం చుట్టారు
డి. 53వ గస్తీ నిషాన్ ద్వారా నిజాం సభలు, సమావేశాలను నిషేధించాడు
1) ఎ, బి, సి 2) బి, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

**25. మత మార్పిడులకు పాల్పడుతున్న కారణంతో ఏ సంస్థలను నిజాం తన రాజ్యంలో నిషేధించాడు?**
ఎ. తబ్లిగ్ జమాత్
బి. బ్రహ్మ సమాజ్
సి. ఆర్య సమాజ్
డి. హిందూ సోషల్ క్లబ్
1) ఎ 2) బి
3) ఎ, సి 4) సి

**26. ఆంధ్ర సారస్వత పరిషత్ గురించి సరైనవి గుర్తించండి.**
ఎ. 1943, మే 26న హైదరాబాద్‌లో ప్రారంభమైంది
బి. సురవరం ప్రతాపరెడ్డి దీని తొలి అధ్యక్షులు
సి. వయోజన విద్య కోసం ఈ సంస్థ విశేష కృషి చేసింది
డి. తెలంగాణ వచ్చాక దీని పేరును తెలంగాణ సారస్వత పరిషత్‌గా మార్చారు
1) ఎ, బి, సి 2) బి, సి, డి
3) ఎ, సి, డి 4) పైవన్నీ సరైనవే

**27. కింది రచనలు, వాటి రచయితలను జతపరచండి.**
ఎ. వెట్టి మాదిగ 1. మాడపాటి హనుమంతరావు
బి. మాలపల్లి 2. భాగ్యరెడ్డి వర్మ
సి. మల్లికా గుచ్ఛం 3. సురవరం ప్రతాపరెడ్డి
డి. ఆంధ్రుల సాంఘిక చరిత్ర 4. ఉన్నవ లక్ష్మీనారాయణ
1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-3, బి-2, సి-4, డి-1
3) ఎ-2, బి-4, సి-1, డి-3
4) ఎ-4, బి-3, సి-2, డి-1

**జవాబులు**

| | | | | |
|---|---|---|---|---|
| 1.1 | 2.3 | 3.4 | 4.1 | 5.4 |
| 6.2 | 7.1 | 8.2 | 9.1 | 10.3 |
| 11.3 | 12.4 | 13.3 | 14.2 | 15.2 |
| 16.4 | 17.1 | 18.1 | 19.3 | 20.2 |
| 21.3 | 22.4 | 23.1 | 24.2 | 25.3 |
| 26.3 | 27.3 | | | |

డా.మంతెన రవికుమార్
విషయనిపుణులు
ఆలూర్, నిజామాబాద్

